నమస్తే తెలంగాణ


# జిందగీ

హైదరాబాద్
శనివారం 7 సెప్టెంబర్ 2024
www.ntnews.com






వినాయక చవితి శుభాకాంక్షలు



భారతీయుల ఆరాధనలో అత్యంత ప్రజాదరణ పొందిన దైవాల్లో వినాయకుడు ముఖ్యుడు. ఆదిదంపతులు పార్వతీపరమేశ్వరుల కొడుకు. దేవ సేనాధిపతి కుమారస్వామి సోదరుడు. విజ్ఞానం, విజయం, అదృష్టానికి వినాయకుడు ఆదిదైవం.. అధిదైవం. విఘ్నాలను పరిహరించేవాడిగా ఏ కార్యక్రమం మొదలుపెట్టినా తొలిపూజ గౌరవం వినాయకుడిదే. ఆయనను ఆవరించి ఉన్న కొన్ని వస్తువుల అంతరార్థం ఇదీ...

# వినాయకా విఘ్న నాయకా!

### » ఏనుగు తల

ఓ రోజు పార్వతీదేవి తన శరీరానికి ఉన్న నలుగు నుంచి ఓ బాలుడిని తీర్చిదిద్దింది. స్నానానికి వెళ్తూ ద్వారానికి అతణ్ని కాపలా ఉంచింది. ఇంతలో పరమశివుడు వచ్చాడు. లోపలికి వెళ్లబోయాడు. బాలుడు అడ్డుకున్నాడు. ఇద్దరి మధ్య యుద్ధం జరిగింది. శివుడు కోపంతో త్రిశూలంతో బాలుడి తల తెంచేశాడు. పార్వతి వచ్చి అసలు విషయం వివరిస్తుంది. దాంతో పరమశివుడు అక్కడ పడి ఉన్న మొండానికి ఏనుగు తలను అమరుస్తాడు. ఆ బాలుడిని శివగణాలకు అధిపతిని చేస్తాడు. అలా ఏనుగు తలతో పునరుజ్జీవం పొందిన గజాననుడు మన జీవితంలో కూడా కొత్తమార్పునకు సంకేతంగా నిలుస్తాడు. కొంతమంది మాత్రం ఏనుగు తల సంపదకు సంకేతంగా పేర్కొంటారు.

### » అంకుశం

ఏనుగులను దారికి తెచ్చుకోవడానికి మావటులు అంకుశాన్ని ఉపయోగిస్తారు. మనం కూడా మనల్ని చెడుదారిలో పయనించేలా చేస్తున్న మనలోని అజ్ఞానాన్ని దారికి తెచ్చుకోవాలని వినాయకుడి చేతిలోని అంకుశం సందేశం ఇస్తుంది.

### » విరిగిన దంతం

వినాయకుడు సాహిత్యానికి, సర్వ విద్యలకు అధిపతి అని తెలియజేస్తుంది. మహాభారతం రచనకు ఈ దంతాన్నే ఏకదంతుడు వినియోగించాడని పురాణ కథ.

### » పాశం

మనం లక్ష్యం దిశగా సాగుతున్నప్పుడు, దారిలో మనకు ఎదురయ్యే ఆటంకాలను వినాయకుడు పాశంతో లాగేస్తాడు. విజయాన్ని సులభతరం చేస్తాడు అనే దానికి గణనాథుడి చేతిలోని పాశానికి ప్రతీక.

### » తొండం

ఎడమవైపు తిరిగి ఉంటే గృహస్థాశ్రమంలో... అంటే ఇహలోక కోరికలను తీరుస్తాడని అర్థం. అదే కుడివైపు తిరిగి ఉంటే ఆధ్యాత్మిక యాత్రలో మోక్షాన్ని ప్రసాదిస్తాడని సూచిస్తుంది.

### » నాగబంధం

లంబోదరుడి బానపొట్టను ఆవరించి నాగబంధం ఉంటుంది. పెద్దపొట్ట విశ్వానికి సంకేతం కాగా, అదంతా గణేశుడి లోపలే ఉంటుందని నాగబంధంతో సూచిస్తారని అంటారు. అంతేకాదు యోగశాస్త్రంలో పాము కుండలినీ శక్తికి సంకేతం కూడా. ఇక గణపతి దగ్గర శత్రుత్వ భావనలు ఉండవనడానికి, విరోధులు కూడా కలిసిమెలిసి ఉంటారనడానికి పాము, ఎలుక నిదర్శనాలుగా కనిపిస్తాయి.

### నివేదనలు «

గణపతి చేతుల్లో అన్నం గిన్నె, మామిడి పండు, లేదంటే మోదక్, లడ్డు లాంటి మిఠాయిలు ప్రధానంగా ఉంటాయి. మోదకం డబ్బు సంచిలా ఉంటుంది. అలా ఇది సంపదకు సంకేతంలా నిలుస్తుంది.

### మూషికం «

తను వెళ్లే మార్గంలో ఎంతటి ఆటంకం వచ్చినా ఎలుక తప్పించుకుని ముందుకు సాగుతుంటుంది. గణపతిని నమ్ముకుంటే మనకు ఎదురయ్యే విఘ్నాలన్నీ ధ్వంసం అవుతాయనడానికి ఎలుక గుర్తుగా నిలుస్తుంది.

### పద్మపీఠం «

పద్మం స్వచ్ఛతకు, జీవించడానికి అవసరమైన దైవశక్తికి నిదర్శనం. ఇక బురదలో వేళ్లూనికుని ఉన్నప్పటికీ పద్మం నీటిపైకి వచ్చి, వికసిస్తుంది. బురద అంటుకోకుండా స్వచ్ఛంగా ఉంటుంది. మనం కూడా మన చుట్టూ ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నప్పుడు కూడా స్వచ్ఛంగా, స్థిరబుద్ధితో మెలగాలని వినాయకుడు కూర్చున్న పద్మపీఠం సందేశం ఇస్తుంది.

### » విఘ్న నివారకుడు

గణం అంటే గుంపు. సమూహాన్ని నడిపే పాలకుడు గణపతి. నాయకత్వ లక్షణాలకూ ఆయనే అధినాథుడు. శిక్షణిచ్చి బుద్ధిని దిద్దే ప్రభువు 'వినాయకుడు'. కోరినవి సిద్ధింపజేయడం వల్ల 'వరసిద్ధి వినాయకుడు' అనే పేరు పొందాడు. దుఃఖం, అజ్ఞానం, దారిద్ర్యం వంటి బాధలు ప్రగతికి, పరమార్థానికి అడ్డంకులు. వాటినే 'విఘ్నాలు' అంటారు. అలాంటి విఘ్నాలను పోగొట్టి విజయాన్ని, ఆనందాన్ని ప్రసాదించే దైవం- విఘ్నేశ్వరుడు.

# విత్తన గణపతికి జయహో



ప్రకృతికి ప్రతిరూపం పార్వతీదేవి. ఆ తల్లి గారాలపట్టి వినాయకుడు.. ఏనుగుముఖంతో ఘనదైవమే కాదు వనదైవం అయ్యాడు. వనానికీ, జనానికీ, పర్యావరణానికీ మేలు చేసే గణపతి ఉత్సవాలు అందుకు విరుద్ధంగా చేసుకుంటుండటంతో వినాయక చవితి ఉద్దేశం నానాటికీ మరుగున పడుతున్నది. ప్రకృతి విధ్వంసకాలైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాల రంగులతో తయారుచేసిన వినాయక విగ్రహాలు ప్రతిష్ఠిస్తున్నాం. కానీ, పండుగ లక్ష్యాన్ని గుర్తించి మట్టి వినాయకుడే మహా వినాయకుడన్న స్పృహ అందరిలో రావాలి. విత్తన గణపతి విశేష గణపతి అనే నిశ్చయానికి రావాలి. ఆ మాటకొస్తే.. వినాయక చవితి పూర్తిగా ప్రకృతి పండుగ. స్వామి సేవలో వినియోగించే పత్రి, పువ్వులూ అన్నీ ప్రకృతి సిద్ధమైనవే. మరి వినాయకుడి ప్రతిమ విషయంలో ఎందుకు వికృత పోకడలు? ఈ వైఖరిని మార్చే ఉద్దేశంతో ఐదేండ్లుగా 'గ్రీన్ ఇండియా చాలెంజ్' విత్తన గణపతి ఉద్యమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నది. ఏటా వేలాది విత్తన గణపతులను తయారు చేసి ప్రజలకు అందిస్తున్నది. విత్తనాన్ని తనలో దాచుకున్న వినాయకుడు నవరాత్రులూ పూజలు అందుకొని.. ఆపై పదిరోజుల్లో మొక్కగా మొలుస్తాడు. చెట్టుగా పెరుగుతాడు. వృక్షమై శతాబ్దాలు నిలిచి ఉంటాడు. పర్యావరణ హితంతోపాటు ఇటు పచ్చదనం పెంచడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తున్నది. ఈ సంవత్సరం కూడా వినాయక చవితికి మట్టి విగ్రహాలను పూజిద్దాం. పర్యావరణ సంరక్షణ ఉద్యమంలో భాగస్వాములం అవుదాం. చవితి వేడుకను హరిత హారానికి వేదిక చేద్దాం.

• **జోగినపల్లి సంతోష్ కుమార్,** మాజీ రాజ్యసభ సభ్యుడు

దర్శనీయం

## కొంగుబంగారం మహాగణపతి

ఏకదంతుడు వెలసిన క్షేత్రాలు తెలంగాణలో అనేకం. కాజీపేటలో శ్వేతార్క గణపతిగా, రేజింతల్‌లో సిద్ధి వినాయకుడిగా, ఆవంచలో ఏకశిలా ఐశ్వర్య గణపతిగా.. ఇలా ఊరికో తీరున కొలువుదీరాడు గజాననుడు. లంబోదరుడు... సంకష్టహర మహాగణాధిపతిగా కామారెడ్డిలో భక్తులపాలిట కొంగుబంగారమై విరాజిల్లుతున్నాడు. పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో కొన్నేండ్లుగా నిత్య పూజలు అందుకుంటున్నాడు స్వామి. తనను దర్శించడానికి వచ్చిన వారికి ఘనమైన వరాలు అనుగ్రహిస్తున్నాడు. ధర్మ సమ్మతమైన కోరికతో స్వామికి ముడుపు కడితే అది తప్పకుండా నెరవేరుతుందని భక్తులు విశ్వసిస్తారు. వివాహం, ఉద్యోగం, సంతానం, విదేశీ యానం తదితర కోరికలు ఈడేర్చమని భక్తులు స్వామికి ముడుపులు కడుతుంటారు. అంతేకాదు, స్వామి వారి సన్నిధిలో మూడు రాత్రులు నిద్ర చేసే సంప్రదాయం కూడా ఇక్కడ కనిపిస్తుంది. ప్రతినెలా సంకష్టహర చవితినాడు మహాగణపతికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. వినాయకచవితి నవరాత్రుల సందర్భంగా ఆలయంలో విశేష ఉత్సవాలు జరుగుతాయి. గాణాపత్యంలో లబ్ధప్రతిష్ఠులైన అర్చకస్వాములు ఇక్కడ స్వామివారిని సేవిస్తున్నారు. హైదరాబాద్ నుంచి కామారెడ్డి సుమారు 115 కి.మీ. దూరం ఉంటుంది. బస్సు, రైలు మార్గంలో ఇక్కడికి చేరుకోవచ్చు.



**ఏనుగంత ఏలిక ఎలుక వాహనంపై తరలి వచ్చేది ఈరోజే. చవితి సంబురాలతో ఊరూవాడా మురిసిపోతున్నాయి. గణేశుడి మంటపాలు విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి. వాద్యహోరులో వీధులన్నీ మార్మోగుతున్నాయి. 'జై బోలో గణేశ్ మహరాజ్ కీ' నినాదాలు కైలాసం దాకా వినిపిస్తున్నాయి. ఇంత వేడుకగా వినాయకుడి పండుగ జరుగుతున్నా.. బొజ్జ గణపయ్య మాత్రం ఒకింత చిన్నబుచ్చుకునే ఉన్నాడనిపిస్తుంది. ఇందుకు కారణాలు అనేకం..**

# మృణ్మయ మూర్తి నమోస్తుతే..



భక్తికి కరిగిపోయే కరిరాజముఖుడిని.. రంగుల హంగులతో కొలువుదీరుస్తున్నాం. మట్టిలోంచి పుట్టిన మహాగణపతిని.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తీర్చిదిద్దుతున్నాం. ప్రకృతి-పురుషుల గారాలపట్టిని.. పర్యావరణానికి హాని తలపెట్టే విధంగా రూపుదిద్దుతున్నాం.

**గణపతి** పూజలో ఓ పవిత్రత కనిపిస్తుంది. మృణ్మయ మూర్తిని తయారుచేయడం, వీధి వీధిలో విగ్రహాలు నెలకొల్పడం, 21 పత్రులతో అర్చించడం.. ఇలా గజాననుడి పూజలో ప్రతీ అంకం ప్రకృతికి నవ వసంతం తెచ్చేదే! విగ్రహాల తయారీకి చెరువుల్లో పూడిక తీయడం వల్ల... తటాకాల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ఎంతటి విపత్తునైనా ఎదుర్కొనే శక్తి సమూహానికి ఉంటుంది. వినాయక మంటపాల ఏర్పాటు, నవరాత్రుల నిర్వహణ, నిమజ్జనోత్సవం ఇవన్నీ ఎవరికి వారే అన్నట్టుండే సమాజాన్ని ఒక్కతాటిపైకి తెచ్చేవే! వినాయక పూజలో ఉపయోగించే పత్రాలన్నీ ఆయుర్వేదం అద్భుతాలని కొనియాడినవే! అనంత చతుర్దశి నాడు వినాయకుడితోపాటు పత్రాలన్నిటినీ చెరువులో నిమజ్జనం చేస్తాం. శ్రావణ, భాద్రపదాల్లో వర్షాల కారణంగా ఉరకలై వచ్చిన వరద జలాలను ఈ ఔషధీ లక్షణాలున్న పత్రి ప్రక్షాళన చేస్తుంది.

### గణేశ పురాణం ఏం చెప్పిందంటే..

గణేశ ప్రతిమ నిర్మాణానికి బంకమట్టి శ్రేష్ఠం. శివారాధనలో పార్థివ లింగం (మట్టితో చేసిన లింగం) ఎంత మహిమాన్వితమైనదో.. మట్టితో చేసిన వినాయకుడి పూజ కూడా అంతే గొప్పది. గణేశ పురాణంలో 49, 50 అధ్యాయాల్లోనూ చవితినాడు మట్టితో చేసిన వినాయకుడి విగ్రహం ప్రతిష్ఠించాలని కనిపిస్తుంది. వినాయకుడి విగ్రహం తయారీ గురించి కూడా అందులో స్పష్టంగా ఉంది.

> *యోగశాస్త్రం ప్రకారం మూలాధార చక్రానికి అధిష్ఠాన దేవత గణపతి. మూలాధారం భూ తత్వం కలిగి ఉంటుంది. కాబట్టి, భూమికి సంకేతంగా మట్టితో విగ్రహం చేసి, మూలాధారానికి అధిదేవత అయిన గణపతిని అర్చించాలి. దీనివల్ల గణపతి అనుగ్రహం సత్వరమే కలుగుతుంది.*

**చెరువు** పూడిక తీయడం, పత్రాలతో జలవనరులను శుద్ధి చేయడం చవితి పండుగ లక్ష్యం. దీనిని పాటించకపోగా, భారీ ఎత్తులో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన విగ్రహాలను నీళ్లలో నిమజ్జనం చేసి నీటిని మరింత కలుషితం చేస్తుంటే.. ఆ లంబోదరుడు బాధపడకుండా ఉంటాడా? రసాయనాలు కలిపిన రంగులు మంచినీటిలో కలిసిపోయి.. జలచరాలకు, ఆ నీటిపై ఆధారపడే మానవాళి ఆరోగ్యాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తుంటే.. వినాయకుడు విస్తుపోకుండా ఉండగలడా? ఆ స్వామి పరిపూర్ణ అనుగ్రహం పొందాలంటే.. మట్టి వినాయకుడే మహా గణపతి అని ఎవరికి వారు తీర్మానించుకోవాలి. గృహస్తులు మట్టి వినాయకుడి పూజకే ప్రాధాన్యం ఇస్తుండటం సంతోషకరం. ఈ వైఖరి మంటపాల్లో కొలువుదీర్చే విగ్రహాలకూ వర్తింపజేస్తే ఏకదంతుడి సేవ అనేక ప్రయోజనాలకు దారి చూపుతుంది.

**హిందూ ధర్మంలో ప్రతి దేవుడూ స్త్రీ, పురుష రూపాల్లో ప్రస్తావనకు వస్తారు. అంతేకాదు స్త్రీ, పురుష శక్తుల కలయికే సృష్టికి కారణంగా కనిపిస్తుంది. పురుష రూపాన్ని ఆధ్యాత్మిక వాస్తవానికి, స్త్రీ రూపాన్ని ఇహలోక వాస్తవానికి ప్రతీకలుగా భావిస్తారు. ఈ క్రమంలోనే శివుడికి- శివాని, విష్ణువుకు- వైష్ణవి, బ్రహ్మదేవుడికి-బ్రాహ్మణి, ఇంద్రుడికి- ఇంద్రాణి తదితర స్త్రీ శక్తిరూపాలు ఉన్నట్టుగా తెలుస్తుంది. వినాయకుడి స్త్రీ శక్తి వినాయకి కూడా ఈ కోవలోనిదే.**

# వినాయకి.. వినాయకుడి శక్తి



పూర్వం అంధకాసురుడు అనే రాక్షసుడు పార్వతీదేవిని మోహించాడు. ఆమెను ఎలాగైనా సరే తన భార్యగా చేసుకోవాలని అనుకున్నాడు. అమ్మవారిని బలవంతంగా చెరబట్టబోయాడు. ఇంతలో ఆమె తన భర్త పరమశివుణ్ని పిలిచింది. అప్పుడు శివుడు తన త్రిశూలంతో అంధకాసురుణ్ని చీల్చేస్తాడు. కానీ, అంధకాసురుడికి ఓ శక్తి ఉంటుంది. నేలను తాకిన ప్రతి రక్తపు బొట్టు నుంచి మరో అంధకాసురుడు పుట్టుకొస్తాడు. అలా శివుడు ఆ అసురుణ్ని నరికినా లాభం లేకుండా పోయింది. ఒక్కొక్క రక్తం చుక్క నుంచి ఒక్కొక్క అంధకాసురుడు పుట్టుకొస్తుంటాడు. దీంతో పార్వతీదేవి సృష్టిలో ఉన్న అన్ని శక్తులనూ సంఘటితం కావాలని పిలుస్తుంది. అలా ఒక్కొక్క దేవుడి నుంచి ఒక్కో శక్తి రూపం బయటికి వస్తుంది. విష్ణువు నుంచి వైష్ణవి, బ్రహ్మదేవుడి నుంచి బ్రాహ్మణి, ఇంద్రుడి నుంచి ఇంద్రాణి ఇలా శక్తులు అంధకాసురుడితో పోరాటం చేశాయి. చివరికి అతణ్ని అంతం చేశాయి. వీటిలో వినాయకుడి నుంచి వెలుపలికి వచ్చిన శక్తి రూపం వినాయకి. ఈమెనే గణేశ్వరి, విఘ్నేశ్వరి అని కూడా పిలుస్తారు. వినాయకుడికి సంబంధించి ఈ స్త్రీ శక్తి రూపం అవతరణ గురించిన వివరణ వనదుర్గ ఉపనిషత్తులో ఉంది. మధ్యప్రదేశ్‌లో నర్మద నదీతీరంలోని బేడాఘాట్ దగ్గర చౌసట్ యోగిని దేవాలయం ఉంది. ఈ ఆలయంలో 64 మంది యోగినుల విగ్రహాలు ఉన్నాయి. వీటిలో ఏనుగు ముఖం కలిగిన వినాయకి విగ్రహం కూడా ఒకటి.

